క్లుప్తంగా

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం



యడ్లపాడు: పేద దివ్యాంగురాలిని ఎంఆర్ ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకుంది. ఉన్నవ గ్రామానికి చెందిన పరమాత్ముల కోటేశ్వరమ్మ కొద్దికాలం కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమె కాలు తొలగించారు. ఒంటికాలిపై కర్రలసాయంతో జీవితాన్ని గడుపుతున్న ఆమె దీనపరిస్థితిని గ్రామస్తులు ఎంఆర్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు తన ప్రతినిధుల చేతుల మీదుగా సోమవారం రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుత్తి సింగయ్య, గల్లా వీరరాఘవయ్య, వెంకట్రావు, కుంచెనపల్లి సాంబశివరావు, వెంకట్రావు, గ్రామపెద్దలు, ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డివాములు దగ్ధం



వినుకొండ(నూజెండ్ల) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు వరి గడ్డివాములు దగ్ధమైన ఘటన వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామం నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్ల షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి కొలగాని వెంకటేశ్వర్లుకు చెందిన 15 ఎకరాలు, కొంగన ఆంజనేయులుకు చెందిన 4 ఎకరాలు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. సుమారు రూ.మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఎస్‌వీ రమణారెడ్డి, ఎం.కోటేశ్వరరావు, ఎం.మల్లికార్జునరావు, జి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

పిండమార్పిడి విధానంతో పశు సంతతి వృద్ధి



శావల్యాపురం: పిండమార్పిడి విధానంతో పశు సంతతి వృద్ధి చెందుతుందని రొంపిచర్ల పశువైద్యాధికారి ఆవుల సాయిమహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో శావల్యాపురం గ్రామానికి చెందిన ముద్దా అచ్చయ్యకు చెందిన ఆవుకు పిండిమార్పిడి పద్ధతిలో చూడి చేయించే విధానానికి శ్రీకారం చుట్టారు. ఈపూరు మండలంలో పిండిమార్పిడి విధానం రెండు ఆవులకు చేశామని, పూర్తిస్థాయిలో విజయవంతమైనట్టు చెప్పారు. పశువైద్యాధికారి రావెళ్ల సురేష్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

టైఫాయిడ్ నిరోధక టీకాలు పంపిణీ



రొంపిచర్ల: స్థానిక భగత్ సింగ్ భవనంలో సోమవారం సబ్సిడీ ధరపై టైఫాయిడ్ నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం పోరంకి మోహన్ కుమార్, సరోజా దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు. 40 మందికిపైగా టైఫాయిడ్ నిరోధక టీకాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు సంద్రపాటి చలపతిరావు మాట్లాడుతూ టైఫాయిడ్ నిరోధక టీకాలు వేయించుకున్న వారికి మూడు సంవత్సరాల పాటు ఈ వ్యాధి రాదని వివరించారు. ప్రతి మూడేళ్లకోసారి టీకాలు వేయించుకోవటం మంచిదన్నారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీసభ్యులు సరికొండ రామకృష్ణంరాజు, బాజీరాణీ, మస్తాన్ వలి, శేషంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాలు మంజూరు

శావల్యాపురం: పాడి పోషకులకు రాయితీపై పశుగ్రాసం జొన్న రకం విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి రావెళ్ళ సురేష్ సోమవారం తెలిపారు. ఒక్కో రైతుకు 15 కేజీల వరకు ఇస్తామని, ఐదు కేజీల సంచి రాయితీ మినహాయించి రూ.115కు ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 3 టన్నులు వచ్చాయని పేర్కొన్నారు.

వివక్షకు తావులేని జగనన్న పాలన

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- బొప్పూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాల వారికి జగనన్న ప్రభుత్వం మేలు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని బొప్పూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటి విభేదాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే మేలు చేకూర్చాలని అప్పట్లో చంద్రబాబునాయుడు బాహాటంగానే ప్రకటించారని గుర్తు చేశారు. అందుకు విరుద్ధంగా తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని, పార్టీ విభేదాలు చూడకుండా అందరికీ న్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంతమైన రాజకీయాలకు తెరతీశారని చెప్పారు. వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని వివరించారు. ప్రజలకు చేసిన మేలు గురించి చెప్పడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వార్డు సచివాలయ వ్యవస్థ అమలులోకి తెచ్చి ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకు మాత్రమే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, సర్పంచ్ షేక్ రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, అమీర్‌జాని, అప్పాపురం మస్తాన్, మీరాబుడే, సైదా, రజాక్, పుల్లారావు, నాని తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోపీనాథస్వామి దేవస్థాన పునఃప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆమె వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్స కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేద పండితులు, దైవజ్ఞులతో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం నాల్గో రోజైన 31వ తేదీ ఉదయం 7.15 గంటల నుంచి 8.20 గంటలలోపు ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామచంద్రప్రసాద్, తోట బ్రహ్మస్వాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఈపూరు : వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు (డీఆర్‌సీ డీడీఏ) ఎం.శివకుమారి తెలిపారు. కొండ్రముట్ల గ్రామంలో ఖరీఫ్ సాగు సమాయత్తంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ సాగు మొదలయ్యే లోపు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పచ్చిరొట్ట విత్తనాలు, ప్రధాన పంటల విత్తనాలు, ఎరువులు అన్నింటిని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కౌలురైతులు తప్పనిసరిగా కౌలురైతు కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు, పశువైద్య అధికారి వి.గోపాల్‌నాయక్, గ్రామ నాయకులు మోపూరి నరసారెడ్డి, గ్రామ పశువైద్యసహాయకురాలు మౌనిక, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శ్రీవిద్య, రైతులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఈపూరు మార్కెట్‌యార్డు కొత్త పాలకవర్గం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- అట్టహాసంగా ఈపూరు మార్కెట్‌యార్డు పాలకవర్గం ప్రమాణస్వీకారం

ఈపూరు : రైతుల పక్షపాతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చెప్పారు. ఈపూరు మార్కెట్‌యార్డు పాలకవర్గం ప్రమాణస్వీకారం సోమవారం అట్టహాసంగా యార్డు ఆవరణలో జరిగింది. యార్డు గౌరవాధ్యక్షునిగా బొల్లా బ్రహ్మనాయుడు, చైర్మన్‌గా చుండూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్‌గా బెలూం శ్రీరామ్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. వారితోపాటు మరో 17 మంది కమిటీ మెంబర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రైతుల పట్ల ఎనలేని ప్రేమ చూపిస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడం మనందరి బాధ్యత అన్నారు. ఈపూరు యార్డు పాలకవర్గం రైతులకు అనేక రకాలుగా సహాయసహకారాలు అందిస్తుందన్నారు. ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కడితే టీడీపీకి పుట్టగతులు ఉండవని, అందుకే తెలుగుదేశం పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని, వారి కుట్రలు సాగవని, ప్రజలు కల్లబొల్లి మాటలు నమ్మరని పేర్కొన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని పేద ప్రజలకు సేవ చేయడం నేర్చుకోవాలని, చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఈర్ష్య పడటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నబ్బాయి, వైఎస్సార్ సీపీ నాయకులు బుచ్చయ్య, వెంకట హనుమయ్య, అబ్బూరి వెంకటేశ్వర్లు, పగడాల వెంకటరామిరెడ్డి, ముండ్లమూరి అనిల్, బాలిరెడ్డి, షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



యడ్లపాడు: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు ఎస్టీ కాలనీకి చెందిన మొగిలి నాగయ్య, రమాదేవిలకు ముగ్గురు సంతానం. వీరిలో ఒక్కగానొక్క కుమారుడైన మొగిలి ప్రసాద్ తోటి వారితో చేరి వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని తెలిసి తల్లి రమాదేవి ఈనెల ఏడోతేదీన మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మొగిలి ప్రసాద్ కాలనీ పక్కనే ఉన్న పీబీసీ సాగర్ కాలువ ఒడ్డున కూర్చొని మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అదే రోజున గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ప్రసాద్(18) మృతి చెందాడు. తండ్రి నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్‌ఐ పైడి రాంబాబు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దీంతో ఎస్టీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపంతో వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన బోడపాటి రోశయ్య(55) పొలం పనులు చేస్తుంటాడు. డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉన్న రోశయ్య ఆ విషయంలో కుటుంబ సభ్యుల మాటలకు మనస్థాపం చెంది మండలంలోని బొప్పూడి ఆంజనేయస్వామి గుడి ఎదురు పొలాల్లో పురుగుమందు తాగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఈపూరు : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బోడిశంబునివారిపాలెం ప్రధాన రహదారి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండకు చెందిన ఇర్ల వెంకటేశ్వర్లు (26) ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకట్రావు, సిబ్బంది అక్కడికి వెళ్లి వివరాలుసేకరించి కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య, ఒక బాబు ఉన్నారు.

ది కేరళ స్టోరీ చిత్రాన్ని నిషేధించాలి

నరసరావుపేట: ది కేరళ స్టోరీ చిత్రాన్ని వెంటనే దేశవ్యాప్తంగా నిషేధించాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఎంసీపీయూ) జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దీన్‌బాషా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు స్పందనలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ చిత్రం మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి



రేమిడిచర్లలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు



మేళ్లవాగు సెక్షన్ పరిధిలో మర్రిపాలెంలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

బొల్లాపల్లి : అటవీ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అటవీ శాఖ అధికారులు తెలిపారు. బొల్లాపల్లి, మేళ్లవాగు సెక్షన్ల పరిధిలో రేమిడిచర్ల, మర్రిపాలెం గ్రామాల్లో పర్యావరణ హిత జీవన విధానంపై ఆ శాఖ అధికారులు సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడే ఉద్దేశంతో ప్రజలను చైతన్యపరిచేందుకు కాలుష్య రహిత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆ శాఖ అధికారులు చెప్పారు. ప్లాస్టిక్ నియంత్రణ, ఇంధన పొదుపు, చెట్ల నరికివేత, వృక్ష సంపద అభివృద్ధిలో అటవీ సమీప గ్రామాల్లో ప్రజలు చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రం చేయడం, ప్లాస్టిక్‌ను అటవీ పరిసర ప్రాంతాల్లో నిషేధించడంపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్వోలు వై.సూర్యనారాయణ, ఎం.హరికుమార్, సర్పంచ్‌లు గాదె వెంకటరమణ, బ్రహ్మనాయక్, జి.కాంతానాయక్, ఫారెస్ట్ బీట్ అధికారులు వై.భాస్కర్, ఎస్.గణేష్‌బాబు, షేక్ అమీర్‌జానీబాషా, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక చేయూత



ఆర్థిక చేయూత అందిస్తున్న రాంబాబు నాయక్

బొల్లాపల్లి : సుగాలీ విద్యార్థులు విద్యతోపాటు ఆటపాటల్లో రాణించాలని అఖిల భారతీయ బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు జటావతు రాంబాబు నాయక్ చెప్పారు. మండలంలోని రాజానాయక్ తండాలో ఆయన జన్మదిన వేడుకలు ఏబీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. తండాలో కింది స్థాయి నుంచి ఆర్థికంగా అంచెలంచెలుగా ఎదిగి వ్యాపారంలో నిలదొక్కుకొని పది మందికి చేయూతనిస్తున్న రాంబాబునాయక్‌ను పలువురు బంజార నాయకులు అభినందించారు. నియోజకవర్గంలోపదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు వంతున ఆర్థికసాయం అందజేశారు. తన స్వగ్రామం రాజానాయక్‌తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోటేశ్వరనాయక్, డి.రామునాయక్, ఎం.బద్యానాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ర్యాలీతో ట్రాఫిక్‌కు అంతరాయం

శావల్యాపురం: శావల్యాపురం జాతీయ రహదారి మార్గంలో టీడీపీ వర్గీయులు చేపట్టిన ర్యాలీ వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కారును గుర్తించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కారును చుట్టుముట్టి ఎమ్మెల్యేను దూషించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో పేట్రేగిపోయారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు టీడీపీ కార్యకర్తలను నియంత్రించేందుకు మీసం తిప్పి హెచ్చరికలు జారీ చేశారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై గల్లా రవికృష్ణ తన సిబ్బందితో ఎమ్మెల్యేకు సర్ది చెప్పి, ట్రాఫిక్ క్లియర్ చేసి పంపించారు.

లింగనిర్ధారణ చట్టం అతిక్రమిస్తే చర్యలు



సమావేశంలో సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో

నరసరావుపేట: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చట్టం–1994ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై నర్సరావుపేట మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, ఉప జిల్లా స్థాయి అడ్వైయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన ఆర్డీఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అనుమతి లేని స్కానింగ్ సెంటర్ల గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికోసం ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, కన్వీనర్ డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ వసంతకిరణ్, ఒ.సాంబశివరావు, డి.శివకుమారి, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన యువకుడు ఒంగపాటి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవటంతో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. మంచానికే పరిమితమై చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎంఆర్ ఫౌండేషన్ అధినేత, ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లెల రాజేష్‌నాయుడు బాధితుడికి అండగా నిలిచి రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. మహేష్ కుటుంబ సభ్యులు రాజేష్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ తులం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండలం గుత్తికొండ బిలం కొలనులో స్నానానికి దిగిన మస్తాన్ షరీఫ్(45) మృతి చెందాడు. మాచవరం మండలం మల్లవోలుకు చెందిన మస్తాన్ షరీఫ్ తాగుడు వ్యసనాన్ని మానేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి పసర మందు తీసుకొనుటకు వచ్చాడు. ముందుగా కొలనులో స్నానమాచరించేందుకు దిగాడు. స్నానం చేసే సమయంలో గల్లంతయ్యాడు. వెంటనే పట్టణ పోలీసులకు స్థానికులు తెలపడంతో ఎస్‌ఐ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా మస్తాన్ షరీఫ్ మృతి చెంది ఉన్నాడు.

ఎత్తిపోతల పథకానికి త్వరలోనే శంకుస్థాపన

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



విద్యుత్ ప్రభను ప్రారంభించి నమస్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: పల్నాడు ప్రజల చిరకాలవాంఛ అయిన వరికపూడిసెల ఎత్తిపోతల పథకానికి త్వరలోనే శంకుస్థాపన చేయిస్తానని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శిరిగిరిపాడులో వేంచేసిన శ్రీవీరాంజనేయ స్వామి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి మాట్లాడారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఈ పథకానికి అటవీ అనుమతులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసేందుకు సీఎం జగన్, ఎంపీ కృష్ణదేవరాయలు ఎంతో కృషి చేశారన్నారు. పల్నాటి ప్రజలకు మంచిరోజులు వస్తున్నాయని, వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్టును సాధించామని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లోని రైతులకు ఈ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, పిన్నెల్లి మదనమోహన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతా ఆదినారాయణ, చపారపు లచ్చిరెడ్డి, ఈగల అయ్యన్న, భూమిరెడ్డి రామాంజిరెడ్డి, లింగాల రాఘవాచారి, గట్లా బ్రహ్మారెడ్డి, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, బొజ్జా శివ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



బాధితురాలికి నిత్యావసరాలు అందిస్తున్న ఆర్ఐ షేక్ రమీజా

నాదెండ్ల: తూబాడు శివారు రాజుగారిపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సంకూరి థామస్ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి బయట నిద్రిస్తుండగా రాత్రి 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న దుస్తులు, గృహోపకరణాలతోపాటు రూ.5 వేల నగదు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్ఐ షేక్ రమీజా గ్రామ వీఆర్వోలతో కలిసి నిత్యావసర వస్తువులు అందించారు. ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

వడియరాజుల సమస్యల పరిష్కారానికి కృషి

మార్కెట్‌యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని వడియరాజుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వడియరాజులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం వడియరాజుల గురించి ఆలోచించలేదని, ఇప్పుడు వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాత్రమే మనకు పట్టం కట్టడంతో పాటు, ఇవ్వాల్సిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఆయన తెలియజేశారు. మనం అడగ్గానే వడ్డెర ఓబన్న విగ్రహాన్ని పట్టణ నడిబొడ్డులో ఏర్పాటు చేసి మన ఖ్యాతిని నలుదిక్కుల కనిపించేలా చేశారని ఆయన తెలియజేశారు. అలాగే మనకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి ఆయన ద్వారా మన సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలియజేశారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లానని, ఆయన పరిష్కరించారని, ఇంకా ఎమైనా ఉంటే వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు కందులూరి శివయ్య, ఇర్లా గురుస్వామి, కౌన్సిలర్లు ఉప్పు వెంకటేశ్వర్లు, వేముల సాంబయ్య, దేవల నాగరాజు, గోగుల వెంకటేశ్వర్లు, గోగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఓర్సు శ్రీనివాసరావు, వడ్డెర సంఘ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

అచ్చంపేట: స్థానిక పాత ఎస్సీ కాలనీలో స్టెల్లా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంభంపాటి నల్లయ్య స్మారక క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, బహుమతులను పంపిణీ చేశారు. మొదటి బహుమతి రాజేష్ సీసీ, ద్వితీయ బహుమతిని సాగర్ సీసీ జట్లు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, ఇరిగేషన్ ఏఈ చిలకా భాస్కర్‌బాబు, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు గనుపల్లి సునీల్‌బాబు, స్టెల్లా యూత్ నిర్వాహకులు సందెపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.